క్లుప్తంగా

టీబీని నిర్మూలిద్దాం

● జిల్లా టీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీవాణి



జూనియర్ డాక్టర్లతో మాట్లాడుతున్న జిల్లా టీబీ కంట్రోల్ ఆఫీసర్ శ్రీవాణి

మద్దిపాడు: టీబీ వ్యాధిని సమూలంగా నిర్మూలిద్దామని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ బి.శ్రీవాణి అన్నారు. సోమవారం మద్దిపాడు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2030 నాటికి టీబీ ముక్త్ భారత్‌గా తయారు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పంతో ఉన్నారని తెలిపారు. జూనియర్ డాక్టర్లతో మాట్లాడుతూ అనుమానిత కేసులను గుర్తించాలన్నారు. ఓపీలో మూడు శాతం కేసులను టీబీ పరీక్షలకు రిఫర్ చేయాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని టీబీ వ్యాధిగ్రస్తుల రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. ఆమె వెంట డాక్టర్ ఆనందమోహన్, జూనియర్ డాక్టర్లు, యూనిట్ ఆఫీసర్ సురేష్, సూపర్‌వైజర్ బాల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం శ్రీదేవి, కోటేశ్వరరావు

కొత్తపట్నం: స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న హాస్టల్ విద్యార్థులకు పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సీహెచ్ కోటేశ్వరరావు తన సొంత నిధులతో సోమవారం పరీక్ష సామగ్రి అందజేశారు. హెచ్ఎం మన్నం శ్రీదేవి చేతుల మీదుగా పంపిణీ చేయగా, ఉపాధ్యాయుడు పర్రె వెంకట్రావు, శేషారావు, పాఠశాల సెక్రటరీ హరిబాబు, శరత్ చంద్ర శ్రీనివాస్, ఎం.రమేష్, నాగమల్లేశ్వరరావు, సుబ్బారెడ్డి, సుబ్రహ్మణ్యం, కృష్ణకుమార్, ధనలక్ష్మి, నిర్మల, ఉమామహేశ్వరి, పద్మశ్రీ, షకీలా, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఒంగోలు వైద్య విద్యార్థినికి రాష్ట్ర స్థాయి బహుమతి



దివ్యను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఏడుకొండలు

ఒంగోలు టౌన్: మంగళగిరి ఎయిమ్స్‌లో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన లివర్ పాథలజీ క్విజ్‌లో ఒంగోలు మెడికల్ కళాశాల విద్యార్థిని బహుమతి అందుకున్నారు. పోస్టు గ్రాడ్యుయేషన్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఆర్.దివ్య మూడో బహుమతి సాధించారు. ఈ సందర్భంగా సోమవారం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు, పాథాలజీ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ సుధాకర్, తదితరులు విద్యార్థినిని అభినందించారు. ఒంగోలు మెడికల్ కాలేజీ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన చేయడం అభినందనీయమని అన్నారు.



సంతనూతలపాడు మండలంలోని మంగమూరులో పీ4 సర్వే చేస్తున్న సిబ్బంది (ఫైల్)

పీ4 ఫీవర్..!

- పీ4 సర్వే పేరుతో పేదలను నిండా ముంచే పనిలో కూటమి ప్రభుత్వం
- 27 రకాల ప్రశ్నలతో చడీచప్పుడూ లేకుండా సాగుతున్న సర్వే
- ఇంట్లోని విలువైన వస్తువుల వివరాలు సైతం నమోదు
- సంక్షేమ పథకాలే ఇవ్వకపోగా, లబ్ధిదారుల్లో కోత విధించేందుకు ముందస్తు పన్నాగమంటూ విమర్శలు
- ఉలిక్కిపడుతున్న పేద ప్రజలు
- సంతనూతలపాడు మండలంలో 93 శాతం పూర్తయిన సర్వే

సంతనూతలపాడు: సంపద సృష్టిస్తా.. సంక్షేమ పథకాలు అందిస్తా.. 108 హామీలు.. సూపర్ 6 పథకాలు అమలు చేస్తా.. పేదలను కోటీశ్వరులుగా మారుస్తానంటూ గత ఎన్నికలకు ముందు నిర్వహించిన ప్రచార సభల్లో టీడీపీ అధినేత చంద్రబాబు ఊదరగొట్టారు. నమ్మి ఓట్లేసి గెలిపించిన ప్రజలను అధికారంలోకి వచ్చిన తర్వాత నిలువునా ముంచారు. సంక్షేమ పథకాల అమలును పూర్తిగా విస్మరించడమే కాకుండా ప్రస్తుతం పీ4 సర్వే పేరుతో పేదలను నిండా ముంచే పనిలో నిమగ్నమయ్యారు. సంతనూతలపాడు మండలంలో చడీచప్పుడూ లేకుండా ఈ సర్వే నిర్వహిస్తుండటం ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది. సామాజిక పింఛన్లలో వృద్ధుల పింఛన్లు ఇప్పటికే కొన్ని నిలిపివేయగా, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు, దివ్యాంగులకు ఇచ్చే పెన్షన్లకు కూడా కోత వేసే దిశగా పీ4 సర్వే జరుగుతోందని, భవిష్యత్తులో ఏమైనా పథకాలు అమలు చేస్తే లబ్ధిదారుల సంఖ్యలో కోత విధించేందుకు ముందస్తుగా ఈ సర్వే చేస్తున్నారని తెలుస్తుండటంతో ప్రజలు ఉలిక్కిపడుతున్నారు. అధికారంలోకి వచ్చి 9 నెలలవుతున్నా సూపర్-6, ఇతర పథకాల అమలును విస్మరించిన కూటమి ప్రభుత్వం.. తాజాగా పీ4 సర్వే పేరుతో.. ఉన్నవి కూడా ఊడపీకేందుకు చూస్తోందంటూ విమర్శిస్తున్నారు. ఫోన్, టీవీ, ఏసీ, ఇతర గృహోపకరణాలు, బైక్‌లు, ఇళ్ల స్వరూపం, రేకులా..స్లాబా, బ్యాంక్ అకౌంట్ వివరాలు.. ఇలా 27 రకాల ప్రశ్నల్ని సంధించి సమాధానాలను నమోదు చేసి ఆపై ప్రజల మొబైల్‌కు వచ్చిన ఓటీపీని నమోదు చేసి పీ4 సర్వే నిర్వహిస్తుండటం సర్వత్రా ఆందోళనకు గురిచేస్తోంది.

సంతనూతలపాడు మండలంలో 13,352 కుటుంబాలకుగానూ 93 శాతం సర్వే పూర్తి...

సంతనూతలపాడు మండలంలో 13,352 కుటుంబాలు నివసిస్తుండగా, వారిలో ఇప్పటికే 93 శాతం కుటుంబాలకు సర్వే పూర్తి చేసినట్లు ఎంపీడీఓ డి.సురేష్‌బాబు తెలిపారు. పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్, పార్ట్నర్‌షిప్‌తో నిర్వహించే పీ4 సర్వేలో సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి అన్ని సమాచారాలు సేకరించి యాప్లో నమోదు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలను గుర్తించి వారి అభ్యున్నతికు కృషి చేయడమే సర్వే ముఖ్య ఉద్దేశమని పైకి చెబుతున్నప్పటికీ.. సర్వేపై ప్రజలకు అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి.

ఏసీ ఉన్నా లక్షాధికారులేనా..?

సంతనూతలపాడు మండలంలో దాదాపు కొన్ని వేల కుటుంబాలకు రేషన్ కార్డులున్నాయి. కొత్త రేషన్ కార్డుల కోసం మరికొన్ని వేల కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. వీరందరినీ దారిద్ర్య రేఖకు దిగువనున్న కుటుంబాలుగానే పరిగణించాల్సి ఉంది. అయితే, అప్పోసాప్పో చేసో.. నెలవారీ వాయిదాలతోనో.. లేక ఎవరైనా కానుకగా ఇస్తేనే వారి ఇళ్లలో ఏసీ ఏర్పాటు చేసుకున్నప్పటికీ.. సదరు వివరాలను ప్రభుత్వ రికార్డుల్లో సిబ్బంది నమోదు చేస్తున్నారు. ఇలాచేస్తే తమకు సంక్షేమ పథకాలు ఆగిపోతాయనే ఆందోళన పేదల్లో నెలకొంది.

నిరాకరించినా నమోదు చేయాల్సిందే...

సర్వేలో సిబ్బంది పొందుపరిచే అంశాలన్నీ ప్రస్తుత జీవనశైలిలో భాగమైనవే. స్మార్ట్ ఫోన్, బైక్లు.. లాంటి ప్రశ్నలు కూడా ఉండటంతో సంక్షేమ పథకాల్లో కోతపడుతుందనే ఆందోళనతో ప్రజలెవరైనా సర్వేకు నిరాకరిస్తే, వారి పేర్లను సైతం నమోదు చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడం కలవరానికి గురిచేస్తోంది.

నాడు సంక్షేమ జాతర.. నేడు పాతర...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో నవరత్నాల పేరిట అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించారు. కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో సంక్షేమం పూర్తిగా అటకెక్కింది. ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకునే వ్యూహంలో భాగంగా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి నాయకులు ప్రజలకు అలవిగాని హామీలిచ్చారు. అధికారంలోకి వస్తూనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చాలా అధ్వానంగా ఉందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు గొంతు సవరించారు. పెన్షన్ రూ.1000 పెంచామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం.. విచారణ పేరుతో వేలాది పెన్షన్లను తొలగించారు. తాజాగా పీ4 సర్వే చేపట్టడం కూడా ఇందులో భాగమేననే సందేహాలు ప్రజానీకంలో వ్యక్తమవుతున్నాయి. సర్వేలో పాల్గొనేందుకు నిరాకరించిన వారి పేర్లు సైతం నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించడం, అలాంటి వివరాలు నమోదు చేసినప్పుడు కూడా బయోమెట్రిక్ ద్వారా ధ్రువీకరించాలని చెప్పడంతో అనుమానాలు బలపడుతున్నాయి. సంపాదనపరుల జాబితాలో వ్యవసాయ కూలీలు, పెన్షనర్ల పేర్లు కూడా చోటుచేసుకున్నాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సర్వేపై ప్రజలు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సర్వే గుట్టు బాబుకే ఎరుకని పరిశీలకులు అంటున్నారు.

ఎన్నో సందేహాలు...

కుటుంబ సభ్యుల పేరుతో వ్యవసాయ భూమి ఎంత ఉంది.? మున్సిపల్ ప్రాంతాల్లో ఎన్ని సొంత గృహాలున్నాయి.? నాలుగు చక్రాల వాహనాలు ఏమైనా ఉన్నాయా.? కుటుంబ సభ్యుల్లో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారా.? ఇన్కం ట్యాక్స్ ఏమైనా చెల్లిస్తున్నారా.? నెలకు విద్యుత్ వినియోగం ఎంత, తదితర వివరాలను కూడా సచివాలయ సిబ్బంది సేకరిస్తున్నారు. ఎక్కువభాగం ఆదాయానికి సంబంధించిన ప్రశ్నలే ఉండటం పలు సందేహాలకు తావిస్తోంది.

> **ఎలాంటి అపోహలు అవసరం లేదు**
>
> ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలను గుర్తించి వారి అభ్యున్నతికు కృషి చేయడమే పీ4 సర్వే ముఖ్య ఉద్దేశం. ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు యథావిధిగా కొనసాగుతాయి. ఇందులో ఎలాంటి అపోహలకు తావు లేదు.
>
> – డి.సురేష్‌బాబు, ఎంపీడీఓ

యూనివర్సిటీకి నిధులు కేటాయించనందుకు నిరసన



పేర్నమిట్టలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

సంతనూతలపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సవరించి ఆంధ్రకేసరి యూనివర్సిటీ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని, వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2000 కోట్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బంకా సుబ్బారావు డిమాండ్ చేశారు. ఆ మేరకు సంతనూతలపాడు మండలంలోని పేర్నమిట్టలో సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 3.22 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ ప్రవేశపెట్టిందని, ఇది కార్పొరేట్లకు అనుకూలంగా ఉందని అన్నారు. బడ్జెట్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకాశం జిల్లాను విస్మరించిందని విమర్శించారు. వెనుకబడిన ప్రకాశం జిల్లా అభివృద్ధికి పదివేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఆంధ్రకేసరి యూనివర్సిటీకి 100 ఎకరాలు కేటాయించినా భవన నిర్మాణాలకు నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. పేర్నమిట్టలో నేటి వరకు యూనివర్సిటీలో క్లాసులు ప్రారంభం కాలేదని, వెంటనే 50 కోట్ల రూపాయలు కేటాయించి భవన నిర్మాణాలు ప్రారంభించి క్లాసులు ప్రారంభించాలని ఆయన కోరారు. పశ్చిమ ప్రాంత ప్రజల ఆశాజ్యోతి వెలిగొండ ప్రాజెక్టు ఎన్నికల హామీగా మాత్రమే కొనసాగుతోందని విమర్శించారు. 30 సంవత్సరాలనాడు ప్రారంభించిన వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయడంలో ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందన్నారు. ప్రాజెక్టు పూర్తి కావాలంటే 4000 కోట్లు అవసరమని ఈ బడ్జెట్లో 2000 కోట్లు కేటాయిస్తేనే మొదటి సొరంగం నుంచి నీళ్లు రావడానికి అవకాశం ఉందని తెలిపారు. కానీ, 309 కోట్లు కేటాయించి ప్రజల కళ్ల నీళ్లు తుడవడానికి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి అన్ను వెంకట సుబ్బారావు, నాయకులు దాసరి చిన్నబాబు, ఉంగరాల రామకృష్ణ, తుళ్లూరు సుబ్బారావు, కోడూరి రామకృష్ణారెడ్డి, పొత్తూరి చిన్న శేషయ్య, కెల్లా అవినాష్, లక్కు తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంటలో నమోదు చేసుకోవాలి



సమావేశం నిర్వహిస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకులు రమేష్‌బాబు

సంతనూతలపాడు: రబీ సీజనులో సాగు చేసిన పంటల వివరాలను ఈ-పంటలో రైతులు నమోదు చేయించుకోవాలని, ఈకేవైసీ పూర్తికాని రైతులంతా వెంటనే పూర్తి చేసుకోవాలని ఒంగోలు సహాయ వ్యవసాయ సంచాలకులు బి.రమేష్‌బాబు అధికారులను ఆదేశించారు. స్థానిక అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ప్రాంగణంలోని ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లో సోమవారం సంతనూతలపాడు, చీమకుర్తి మండలాల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సంచాలకులు మాట్లాడుతూ రైతు రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ముందుగా భూ యజమానులు, భూ రికార్డులు సరిగా ఉన్న రైతులను గుర్తించి వారికి వెంటనే రైతు రిజిస్ట్రేషన్లు పూర్తిచేయాలని తెలిపారు. పీఎం కిసాన్‌కు సంబంధించిన ఈకేవైసీ, రైతు స్వతహాగా చేసుకున్న రిజిస్ట్రేషన్లను పరిశీలించి వాటిని కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతు సేవా కేంద్రం పరిధిలోని రైతులకు భూసార పరీక్ష ఆవశ్యకత, ఉపయోగాల గురించి అవగాహన కల్పించాలన్నారు. మట్టి నమూనాలు తీసే విధానాన్ని వివరించి తీసిన మట్టి నమూనాలను ఒంగోలులోని భూసార పరీక్ష కేంద్రానికి చేర్చాలని తెలిపారు. కార్యక్రమంలో సంతనూతలపాడు, చీమకుర్తి మండలాల వ్యవసాయాధికారులు పి.పావని, డి.వి.భాస్కర్, వ్యవసాయ విస్తరణ అధికారులు ఎస్.వెంకటరావు, కె.వి.సుబ్బారెడ్డి, పి.వెంకటేశ్వర్లు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

బంగారు బాల్యంపై ప్రతిజ్ఞ, కొవ్వొత్తుల ర్యాలీ



బంగారు బాల్యంపై ప్రతిజ్ఞ చేస్తున్న మండల అధికారుల బృందం

సంతనూతలపాడు: మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బంగారు బాల్యంపై సోమవారం కొవ్వొత్తులు ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 8న మహిళా దినోత్సవంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ ఎం.రమణమ్మ, మండల పరిషత్ ఏవో ఈదర విజయలక్ష్మి, ఎన్ఆర్ఈజీఎస్ మండల ఏపీవో వాసంతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.నాగలక్ష్మి, ఆర్.పార్వతి బాయ్, వెలుగు ఏపీఎం టి.బాబూరావు పాల్గొని ప్రతిజ్ఞ చేసి సంతకాల సేకరణలో భాగస్వాములయ్యారు. మద్దిపాడు ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీఓ ఆర్.ఇమాంజలి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీసీలు శ్రీనివాసులు, రామాంజనేయులు, మండల పరిషత్, వెలుగు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. పేర్నమిట్టలోనూ ర్యాలీ, ప్రతిజ్ఞ, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పేర్నమిట్టలోని ఒంగోలు 42వ డివిజన్ శాంతినగర్లో సోమవారం ఐసీడీఎస్ పేర్నమిట్ట సెక్టార్ సూపర్‌వైజర్ రమా ఆధ్వర్యంలో ర్యాలీ, ప్రతిజ్ఞ, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఏఎన్ఎం సరస్వతి, మహిళా పోలీస్ సింగమ్మ, అంగన్వాడీ టీచర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వానపాములతో నేల సారవంతం

కొండపి: వానపాములు నేలను సారవంతం చేస్తాయని ప్రకృతి వ్యవసాయం విభాగం డీపీఎం వి.సుభాషిణి అన్నారు. మండలంలోని స్థానిక రైతు సేవా కేంద్రంలో 20 రకాల విత్తనాలతో విత్తనశుద్ధి చేసి 100 పీఎండీఎస్ కిట్లను తయారు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీఎండీఎస్ విత్తనాలు నేలలో చల్లడం వల్ల తొలకరి వర్షాలకు నేలలో విత్తనాలు పెరిగి వానపాములు నేలను సారవంతంగా తయారు చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ మనోజ్, ఎంటీ ఎస్తేర్, యూనిట్ ఇన్‌చార్జి మందాకిని, మాధవ ఐసీఆర్పీలు జ్యోత్స్న, మాలకొండయ్య, గౌతమి, వీఏఏ వెంకటనారాయణ, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

హనుమంతునిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని కాంప్లెక్స్ చైర్మన్ బొప్పరాజు పరిశీలించారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ అమలు చేసి మెనూలో తేడాలు లేకుండా జాగ్రత్తగా వంట చేయాలని కుకింగ్ ఏజెన్సీలకు సూచించారు.

బాల్యవివాహాలను అరికట్టాలి



ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

చీమకుర్తి రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాల సందర్భంగా స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం బాల్యవివాహాల నిర్మూలనపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ అధికారి కె.ప్రమీల పాల్గొని మాట్లాడారు. బాలికలు చదువులో రాణించి ఉన్నత స్థాయికి వెళ్లాలని, తద్వారా లింగ వివక్ష, బాల్య వివాహాలను రూపుమాపే అవకాశం ఉంటుందని అన్నారు. అనంతరం బాల్య వివాహాలను అరికట్టాలంటూ ప్రతిజ్ఞ చేయించి సంతకాలు సేకరించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షకు వేళాయే..!



ఇంటర్ సెకండియర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. విద్యార్థులు హడావిడిగా పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పలువురు విద్యార్థుల వెంట వారి తల్లిదండ్రులు కూడా పరీక్ష కేంద్రాల వరకూ వచ్చి జాగ్రత్తలు చెప్పారు. తొలి పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

– సాక్షి, ఒంగోలు



పరీక్ష హాల్లోకి వెళ్లే ముందు కూడా చదువుకుంటున్న విద్యార్థినులు



ఏకేవీకే కాలేజీ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల హాల్‌టికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది







తల్లిదండ్రులతో కలిసి పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థులు



చివరి నిమిషంలో పరీక్ష కేంద్రంలోకి పరిగెడుతున్న విద్యార్థి



ఒంగోలులోని ఏకేవీకే కాలేజీ పరీక్ష కేంద్రంలోకి క్యూలో వెళ్తున్న విద్యార్థులు

నారాయణస్వామి ఆదాయం రూ.1.59 లక్షలు



ఈఓకు విరాళం నగదు అందజేస్తున్న దాతలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.1,59,150 ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ ఎస్‌జీఆర్. నరసింహబాబు తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రు.48,830, లడ్డుప్రసాదాల అమ్మకంద్వారా రూ.22,760, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.82,044, పంచామృతాభిషేకానికి విరాళంగా రూ.5,516 వచ్చినట్లు వారు తెలిపారు. అన్నదానానికి గూడూరుకు చెందిన మంచికంటి పుల్లయ్య, విజయలక్ష్మిగారు విరాళం నగదు రూ.44,116లను పామూరుకు చెందిన మంచికంటి మధుసూదనరావు ద్వారా అందజేసినట్లు చైర్మన్, ఈఓ తెలిపారు. కార్యక్రమంలో కొమ్మినేని వెంకట్రావు, ముడుమాల నారాయణరెడ్డి పాల్గొన్నారు.